పల్లపండగ

టేకుమళ్ల కామేశ్వరరావు

టేకుమళ్ల కామేశ్వరరావు 1907లో జన్మించారు. తొంభై ఏళ్ల జీవితంలో శక్తివంచన లేకుండా సాహిత్య సేవ చేశారు. కలువలు అనే ఖండకావ్యం, పిల్లల గేయాలు, వాడుకభాష గురించి మెళకువలు రాశారు. జానకిప్రేమ, రోజా పేరుతో కథా సంపుటాలు వెలువరించారు. నా వాఙ్మయమిత్రులు పేరుతో ఆనాటి ప్రముఖులపై వ్యాసాలు రాశారు. వాడుక భాషను ఎంత పదునుగా పఠన యోగ్యంగా రాయవచ్చునో కామేశ్వరరావు తమ కథలలో నిరూపించారు. తొలితరం తెలుగు కథకులలో విలక్షణమైన శైలి ఇతివృత్తం కలిగిన వారు. కాని వ్యావహారిక భాషకు, తెలుగు కథకు కామేశ్వరరావు చేసిన సేవ తగినంత గుర్తింపు పొందక పోవడం దురదృష్టం. ఈ కథ రచనా కాలం 1941.

ఎప్పటిలాగే ఎరుకయ్య రోజల్లా పచ్చజొన్నచేలో ఆలోచనల తోటే పని చేశాడు. సాయంత్రం ఆలోచనలతో నిండి చింతలగూడానికి వచ్చాడు. కాళ్ళూ, చేతులూ కడుక్కున్నాడు. గుడిసె వెనకాల రావి చెట్టు చుట్టూ ఉన్న దిమ్మె మీద కూచున్నాడు. ఆలోచనలో మునిగిపోయాడు. కొంతసేపటికి నెమ్మదిగా "మాకిక్కడేమీ పులుల బాధ లేదు. ఎలుగ్గొడ్ల బాధాలేదు. చేలకి అడివి పందుల బాధ కూడా కనబడదు. మా పశువులు సుఖంగా పడుకుని నెమరు వేస్తున్నాయి. నాలుగు తరాల కిందటే కొండల్లో ఉన్న గూడేన్నీ, దానితో మాబాధల్ని విడిచిపెట్టి వెల్లడి ప్రదేశం వచ్చి చేరుకున్నాం. పాలగడ్డ జీవనది. మాకు నీళ్ళకి లోటులేదు; మా పంటకేమీ లోటు లేదు. ఇన్ని సౌఖ్యాలు ఉన్నా మా అడివి జాతిని- కాదు, అడవులూ, కొండలూ విడిచి పెట్టేశాము కదా- మా వెల్లడి జాతిని తలుచుకొంటూంటే నా మనస్సులో చదరంత కారుమబ్బు బయలుదేరి లోపలంతా ఆవరించి మెరుపులతోటీ, ఉరుములతోటీ బైటికి వచ్చి బ్రహ్మాండమంతా బద్దలు చేసి, నన్ను బాధ పెడుతుంది. మావాళ్ళు చేసే పనులు ఏమని తలుచుకోను! ఆడవాళ్ళకి అందం కోసమని పళ్లు ఊడకొడతారు. దాన్ని 'పళ్ల పండగ' అంటారు. ఆ విషయం తలుచుకొంటుంటే నాకు ఏడుపు వస్తుంది. ఏడుపే కాదు నవ్వు కూడా వస్తుంది. ఎంత అజ్ఞానం! ఎటువంటి జాతిరా దేవుడా! మాకు ఎటువంటి పండగ కల్పించావు గంగమ్మ తల్లీ!' అని విచారంతో అనుకున్నాడు. కొంత సేపటికి చటాలున జాగ్రత్తపొంది, "మా తమ్ముణ్ణి అడిగి చూస్తాను వాడు ఏమంటాడో" అనుకుని కొంత ఉత్తేజం పొందాడు.

గుడిసెలోంచి చంద్రయ్య రాకకోసం

ఆణిముత్యాలు

ఎరుకయ్య చూశాడు. కొంత సేపటికి చంద్రయ్య, చేత్తో పూరిడి పిల్ల పంజరం పట్టుకుని ఇవతలకి వచ్చాడు. ఎరుకయ్య "చంద్రయ్యా!" అన్నాడు.

"అన్నయ్యా!" అంటూ చంద్రయ్య దగ్గరికి వచ్చాడు. పంజరం కింద పెట్టాడు.

ఎరుకయ్య పూరిడి పిట్టను గురించి రెండు మూడు ప్రశ్నలు వేశాడు. తర్వాత చంద్రయ్య యోగక్షేమాలు ప్రత్యేకంగా అడిగాడు. పిమ్మట "ఒరే తమ్ముడూ! పళ్ల పండగని గురించి నీ అభిప్రాయమేమిటి, అది మంచిదా, చెడ్డదా?" అన్నాడు జంకుని కనపరచక.

చంద్రయ్య "అది మన ఆచారం. పెద్దల దగ్గిరనుంచీ వస్తుంది. పెద్దలు ఎంతో ఆలోచించి

చేసిన పని. అద్భుతమైనది. అందమైనది, అవసరమైనది. దాంట్లో ఇంకా ఎన్నెన్నో సుగుణాలు ఉన్నాయి" అన్నాడు వేరే ఆలోచన లేకుండా.

ఎరుకయ్య దిగ్భ్రమ చెందిపోయాడు. తాను నిలుచున్నాడో, కూచున్నాడో, ఏమిటి చేస్తున్నాడో అతనికి తెలియదు. తర్వాత తనలో "ఈరకం ఆలోచనలు వీడికి ఎవరు నేర్పారు... అసలు పళ్ల పండగలో ఆలోచన ఏదీ? ఆలోచన లేకపోవడమే అందులో వున్న విశేషం. పెద్దల దగ్గరినుంచీ ఈ ఆచారం వస్తుంది. నిజమే! ఆలోచన లేకుండా అనుసరిస్తున్నాం. ఇలాగ ఇలాగని దానిని గురించి ఆలోచించిన వాడెవడు? ఎవడేనా దాని విషయమై తర్కించి దాని మంచిచెడ్డలు చెబితే మండి పడతారు" అని అనుకొని చంద్రయ్యతో "అబ్బాయి! నువ్వు దాని మంచి చెడ్డలు ఆలోచించు. బాగా ఆలోచించు. నాకు ఎల్లుండి చెప్పు, తొందరలేదు. నేను అడిగిన ప్రశ్నకి ఉన్నపాటున జవాబు చెప్పవలసిన జరూరులేదు. నువ్వు నిష్పక్షపాతంగా ఎలాగ చెప్తే అలాగ నడుచుకుంటాను. విన్నావా?" అన్నాడు ప్రశాంతంగా. అందుకు చంద్రయ్య "ఆలోచించకుండా చెప్పాననుకున్నావేమిటి?" అని కుండ బద్దలయినట్టు నవ్వాడు. ఎరుకయ్య తనలో "వీడు చెయ్యని పని చేసినట్టుగా ప్రశంసించుకుంటున్నాడు" అనుకుని, విరుచుకు వచ్చే చిరునవ్వు ఆపుకుని "అలాగ కాదు. ఎల్లుండి వరకు అక్కర్లేదు. నువ్వు రాత్రల్లా ఆలోచించి రేపు నాకు చెప్పు. అంతే నేనడగడం. ఇంక నాకు మారు చెప్పవద్దు" అన్నాడు ఖచ్చితంగా. చంద్రయ్య చిరునవ్వు ఆపుకొని, మరి కాస్సేపటికి పంజరం తీసుకొని వెళ్ళిపోయాడు.

ఎరుకయ్య మనస్సు చాలా కలతగా వుంది. అతడు ఏ పని చేసినా ధ్యానం మరొక చోట ఉంచుకునే చేస్తున్నాడు. తన భార్యతో కాని, లేక అంతకంటే ప్రియమైన తమ్ముని కొడుకుతో కాని మాట్లాడేటప్పుడు కూడా అతను అనవలసిన మాట ఒకటీ. అనే మాట ఇంకొకటీగా ప్రవర్తిస్తున్నాడు. అతను తెల్లారకుండానే ఉట్టినే పొలం వైపు వెళ్లి, మబ్బుతో నిండిన ఆకాశం కింద చిరుచీకటిలా నిద్రిస్తూన్న చేల వైపు చూసి, చప్పుడు చేస్తూన్న పంట కాలువ ధ్వనీ, రివ్వున ఎగిరి పోతున్న కొంగల చప్పుడు విని కూడా మనస్సు మారక తిరిగి వస్తూ "భగవంతుడు యిచ్చిన పళ్లని, అందమైన పళ్ళని, నమలడానికి అవసరం లేని పళ్ళని లేనిపోని మంత్రాలు, పూజలు చేసి, ఏడుస్తూంటే, ఆడదానికి పెళ్లిముందర, అనగా పదహారేళ్ళప్పుడు – విలవిల తన్నుకుంటూంటే, కాళ్లూ చేతులూ పట్టుకుని, ఉలి రాళ్ళతో ఊడకొడతారు. పాపం, పళ్ళు పూర్తిగ ఊడక సగం విరిగిపోయిన వాళ్ళు కొందరు, పక్క పళ్ళు కదిలి జన్మంతా బాధపడే వాళ్ళు కొందరు. ఏమి ఆనందం చెప్మాయిది! బోసి నవ్వు అందమా! మేము మునిపళ్ళతో కొరికేది వాళ్ళు కుక్కలలాగు, పందులలాగు, పిల్లులలాగు దంతాలతో నములుతూ వుంటే అందమా! మా మొగాళ్ళు నవ్వుతూంటే, నల్లని మబ్బులో మెరుపులాగ, మల్లె పువ్వుల తీగలాగ, ముత్యాల సరంలాగ మెరిసిపోతాయి పళ్ళు. ఆడవాళ్ళు నవ్వుతూంటే వికారపు రాక్షసి నవ్వులాగ నా కంటికి కనపడుతుంది. అందరి కళ్ళూ భగవంతుడెలాగు చేశాడో కాని! భగవంతుడు చేసిన కళ్లో, ఆచారం చేసిన కళ్ళో వాళ్ళవి" అని తీవ్రంగా ఆలోచన సాగించాడు. మరికొంత సేపటికి బాగా తెల్లారింది. తూర్పున మబ్బు చెదిరిపోయింది. నీరెండ ప్రపంచాన్ని తేజోవంతం చేస్తూంది. మంచుకి తడిసిపోయిన గుడిసెల మీద సూర్యుని లేత కిరణాలు పడగా గుడిసెలు తెల్లమేఘాల లాగ మెరుస్తు న్నాయి. ఎరుకయ్య గుడిసెకు వస్తూ ఆందోళనగా "తమ్ముడు ఏమిటి చెప్తాడో, ఏమిటో?" అని గాబరా పడుతున్నాడు. అతని తల వేడిగా వుంది. రాత్రింబగళ్ళూ ఆలోచనలతో నిండి ఉండడం వల్లా, రాత్రిళ్ళు తిన్నగా నిద్ర లేక పోవడం చేత, అతను వస్తుండగా కాళ్ళూ, చేతులూ, మొహం చెమటలు పోస్తున్నాయి.

చంద్రయ్య కాలకృత్యాలు తీర్చుకుని, చెవుల్లో మందార పువ్వులు పెట్టుకుని, వెదురు పేళ్ల పళ్ళెంతో గన్నేరు పువ్వులు, పారిజాతాలు, మందార పువ్వులు, బంతి పువ్వులు తెస్తున్నాడు.

ఎరుకయ్య చంద్రయ్యని చూసి హఠాత్తుగా ఆగిపోయాడు. ఎరుకయ్య రావడం చూసి చంద్రయ్య నిలబడ్డాడు. ఎరుకయ్య కంగారుగా బయలుదేరాడు. చంద్రయ్య దగ్గరికి వచ్చి పళ్ళెంలో పువ్వులు తీసుకుని చెవుల్ని ధరించి ప్రశాంతమైన మొహం కనబరిచి "ఏమంటావు?" అన్నాడు.

చంద్రయ్య ఊరుకున్నాడు.

మెరుపులాంటి ధైర్యం పుట్టి మాయమైంది ఎరుకయ్యలో. అతను "మనస్సుకి తోచిన విషయమే నాకు కావాలి" అన్నాడు ప్రయత్నం లేక.

చంద్రయ్య ఊరుకోగా ఎరుకయ్యకి ధైర్యం కలిగింది. "ఆలోచిస్తే అలాగే వుంటుంది అబ్బాయీ!" అన్నాడు.

చంద్రయ్య మళ్ళీ ఊరుకున్నాడు.

తన తమ్ముడికి కూడా తనకి తోచినట్టే తోచిందనే ఉత్సాహం మనస్సుని ఊపి వెయ్యగా ఎరుకయ్య "జాతి అంతా ఇలాగ ఉండడం ఆశ్చర్యం వేస్తుంది" అన్నాడు గంభీరంగా.

చంద్రయ్య ధ్యానం ఎరుకయ్య మాటల మీద ఉన్నా, రంగు రంగుల పువ్వుల మీద దృష్టి మారుతుంది.

"ఎవరికి వాళ్ళు ఆలోచించుకుంటే చూశావా?" అని చంద్రయ్య ఆత్మస్తుతి కలిగేటట్లా అని, ఉత్సాహం పట్టలేక "మనం కొండయ్యని అడుగుదాం పద" అని అడుగు వేశాడు ఎరుకయ్య.

"భోజనం చేశాక" అన్నాడు చంద్రయ్య.

ఇద్దరూ చల్లన్నం తిన్నారు. తింటూన్నంత సేపూ మనస్సులు అక్కడ లేవు. ప్రపంచమంతా దిగ్విజయం చేసి వచ్చినట్లుగా ఎరుకయ్య మనసు ఉత్సాహ పడుతూ ఉంది. కాని బైటికి అతడు కనబరచడం లేదు. చంద్రయ్య పరధ్యానంగా భోంచేసి, లేవడం మాటే మరిచిపోయి కూచున్నాడు. ఎరుకయ్య లేచి తమ్ముణ్ణి లెమ్మన్నాడు.

✤✤✤

కొండయ్య గుడిసె ఇవతల ఊరికే చల్లగాలికి నిలుచున్నాడు.

"కొండయ్యా!"

"ఏం ఎరుకయ్యా! తమ్ముణ్ణి వెంట పెట్టుకు వచ్చావు?"

"చల్లన్నం తిన్నావా?"

"అయింది. పొలం మీదికి వెళ్ళబోతున్నా"

"మేము గూడా వస్తాం పద"

"పని అట్టే లేదు, మరెందుకు?" అని కొండయ్య వెనక్కి తగ్గబోయాడు.

"సరదాగా పోదాం" అన్నాడు ఎరుకయ్య.

కొండయ్య గుడిసెలోనికి వెళ్లి కర్ర చేత్తో పట్టుకుని, జోడు తొడుక్కొని పై మీద గుడ్డ వేసుకొని వచ్చాడు. అంతా నడుస్తున్నారు.

"కొండయ్యా!" అన్నాడు ఎరుకయ్య.

"ఓహ్!"

"కొండయ్యా! నీ పళ్ళు ఎలాగ మెరుస్తున్నాయో ఆ లేత సూర్యుని కిరణాలకి, అలాగే చూడాలని ఉంది సుమా!"

చంద్రయ్య మాట్లాడకుండా వింటున్నాడు.

"ముత్యాల పేరు లాగా వుంటాయి నా పళ్ళు, ఇంకా ఇప్పుడు వన్నె తగ్గిపోయాయి కాని"

"తళతళమంటున్నాయి నక్షత్రాల లాగ"

"పళ్ళకుండే అందం దేనికుంది?"

"పళ్ళే అందమంటావు?"

"కాకపోతే"

"పళ్ళు ఊడకొట్టుకుంటే నో?"

"అందంగిందం లేదు, పిల్ల కాకి నోరులాగ"

"అయితే, కొండయ్యా! ఆడవాళ్ళ పళ్ళు ఊడకొట్టిస్తామేం?"

"ఆడవాళ్ళకి అలాగ ఉంటేనే అందం!"

ఎరుకయ్య నవ్వూ, కోపం ఆపుకొని "అదేమిటయ్యా, అలాగ మాట్లాడతావు? ఇప్పుడే కాదూ అన్నావు, పళ్లుంటే అందమని, పళ్లు ఊడకొడితే అసహ్యమని?"

"ఔను, మొగాళ్ళ సంగతి చెప్పాను. ఆడవాళ్ళ సంగతి చెప్పలేదు"

"పళ్లు లేకపోతే ఆడవాళ్ళకి మట్టుకు అందం ఎలాగయ్యా?" అన్నాడు ఎరుకయ్య.

"అబ్బెబ్బే! ఎంతమాట! అందమంటే అదే! ఆ విషయం తెలిసే మన పూర్వులు ఆడవాళ్ళకి పళ్లు

రాలగొట్టారు. వాళ్లు తెలివి తక్కువ వాళ్లు కారు, మనలాగ"

"అయితే పళ్లుంటే అందం అనే మనమే తెలివి తక్కువ వాళ్ళం. ఏమంటావు.

నిస్సందేహంగా, "వాళ్ళెంత ఆలోచించి ఏర్పాటు చేశారో ఆ ఆచారం"

"అయినా ఆలోచిద్దూ!"

"ఆలోచించినా తేలేదంతే"

చంద్రయ్య అందుకున్నాడు. "ఆలోచించు చూడు"

"అయితే ఇప్పటి వరకూ ఆలోచించనే లేదంటావేమిట్రా" అన్నాడు కొండయ్య.

"నేను ఏమీ అనను. నేను అనేది ఒకటే. ఆలోచించి చూడమన్నాను" అన్నాడు ఎరుకయ్య.

"నేను అనేది అంతే" అన్నాడు చంద్రయ్య.

"ఆలోచిస్తే మరింత అవుననిపిస్తుంది. ఆ సంగతి ఎరిగే మొట్టమొదటే చెప్తున్నా" అన్నాడు కొండయ్య తన తెలివితేటలు గ్రహిస్తూ.

"నేనడిగేది నిన్ను మరేం లేదు. నాకు ఏ విషయమైనా రేపు చెప్పు. నేను నీకు నచ్చచెప్తున్నాననుకుంటున్నావేమో? నాకు చేత కాదు. నేను అడిగేది ఇంతే. నువ్వు ఆలోచించుకో. నీ మనస్సునడుగు. ఏది న్యాయమో అది తేల్చుకో. తేలిన విషయం రేపు నాకు చెప్పు" అన్నాడు ఎరుకయ్య. కొండయ్య ఏదో చెప్పబోయాడు కాని, చంద్రయ్య కూడా "రేపు చెప్పు. ఇవాళ ఏమీ అనవద్దు. అనుభవం మీద నేను చెప్తున్న మాటలు ఇవి. నా మాట విను" అన్నాడు.

ఎరుకయ్య అనేకసార్లు ఎంతమందికో నచ్చచెప్పబోయి వేగిపోయాడు. మనుష్యులు వాదనకు ఒప్పుకోరనీ, తమంతట తాము ఆ విషయమై ఆలోచించినప్పుడే వారు దారికి వస్తారనీ ఎరుకయ్య అనుభవం.

ఎరుకయ్య కొండయ్య దాపుకి వచ్చాడు. కొండయ్య తన మనసులో వుండే అభిప్రాయం రహస్యంగా చెప్పాడు. కాని ఆచారం, పెద్దల ఆచారం, పూర్వులు గొప్పవారు, మన సంప్రదాయం, మన మతం అని ఏమిటేమిటో దానికి అడ్డుగా చేర్చబోయాడు. ఎరుకయ్య అన్నాడు. "నాకు కావలసింది నీ మనస్సు చెప్పే న్యాయం కాని మరేమీ కాదు. నీ మనస్సు నువ్వు విప్పి చెప్పినందుకు సంతోషిస్తున్నాను" అతను మనస్సులో ఎంతో ఆనందపడ్డాడు.

ఎరుకయ్యా, చంద్రయ్యా తిరిగి ఇళ్ళకు వస్తుండగా చలమయ్య ఎదురయ్యాడు. పళ్ళ పండగని ఎరుకయ్య చలమయ్యని అడిగాడు. అందుకు అతను నేను ఆలోచించనన్నాడు. ఎరుకయ్య ఏమీ చెయ్యలేకపోయాడు. చలమయ్యతో మాట్లాడుతూన్నప్పుడు దగ్గర చింతయ్య గూడా వున్నాడు. చింతయ్య గూడెంలోని పెద్ద మనుష్యులలో లెక్క. అతనంటే ఎరుకయ్యకి ఇష్టం. చింతయ్య ఎరుకయ్య చెప్పిన విషయాలు మనస్సుకి పట్టించుకున్నాడు.

ఎరుకయ్య ఆలోచిస్తున్నాడు: "ఈ మోస్తరుగా ప్రతివారికీ బోధపరచడం నా తరమా? ప్రతివాడికీ బోధపడుతుందా? బోధపడని వాడి వల్ల సంఘానికి అపకారం జరగవలసిందేనా? అందరికీ బోధపడే వరకూ మనం ఆగితే ఎన్ని పురుషాంతరాలు పడుతుంది? ఎన్ని శతాబ్దాలు పడుతుంది? అన్ని శతాబ్దాలకైనా ఈ పని జరుగుతుందనే నిర్ధారణ ఏమిటి? క్రమేపీ ఈ విషయమై ప్రజ ఆలోచన మానెయ్యగూడదా? ఇందరికీ నచ్చజెప్పి వారిచేత పని చేయించడానికి పూనుకోడం సబబైన పనా?"

చింతలగూడెంలో చిన్నా పెద్దా వెయ్యి మంది ఉన్నారు. కుల పెద్ద ఉన్నాడు. అతని పేరు జాలయ్య, జాలయ్య మాటే గూడెమంతటికీ శాసనం. అతనే రాజు. అతనే మతాధికారి. అతను చెప్పిందే వేదం.

జాలయ్యకి ముందు మేలయ్య కులపెద్దగా ఉండేవాడు. అతని కాలంలో జాతికంతా

హైకూ!

పేరు సూర్యుడు
వూరు అరసవిల్లి
నగే కిరణం!

–జి. విజయశ్రీ

బోలెడంత ఉపకారం జరిగింది. గూడెం మీదికి ఒక అడవిజాతి వారు దండెత్తి వచ్చారు. మేలయ్యా వారిని ఓడించి తరిమివేశాడు. జాలయ్యకి అటువంటి బాధలేమీ లేవు. దేవతలకి జాతరలు చెయ్యడం, గూడెంలో వచ్చిన తగవులు తీర్చడం, పంటల విషయంలో శ్రద్ధ కనబరచడం- ఇదే అతను చేస్తూన్న పనులు.

ఎరుకయ్య అనేక మందికి తన ఊహలు తెలియపరుస్తున్నాడు. ఆలోచించమంటున్నాడు.

ఎరుకయ్యకి పిల్లలు లేరు. చంద్రయ్యకి మాత్రం ఒక కొడుకు. తన ఇంట్లో తన అభిప్రాయం ఆచరించే అవకాశమే లేకపోయింది. కొండయ్యకి కూతుళ్ళున్నారు. ఇద్దరు పెళ్ళీడు పిల్లలు.

ఒకరోజు సాయంత్రం ఎరుకయ్య కొండయ్యా గుడిసెకి వెళ్ళాడు.

"తమ్ముడూ! విశేషాలేమిటి?"

"ఉంటే నువ్వు చెప్పు."

"పిల్లల పెళ్ళిళ్ల మాటేమిటి?"

"చెయ్యకపోతే ఎలాగ? వాళ్ళు ఇంకా ఏ విషయం నాతో చెప్పడం లేదు."

"మరి పళ్ల పండగ మాటేమిటి?"

"చేద్దాం అదీను"

"చేద్దాం!" అని ఆశ్చర్యపోయాడు ఎరుకయ్యా. "చెడ్డదనుకున్నాం కాదుటయ్యా!" అన్నాడు.

"మనమొక్కళ్లమే కాదు కదా చేసేది."

"మనం దారి తీస్తే అందరూ తీస్తారు."

"అందరూ ఎప్పుడూ తియ్యరు. ఎవడి దోవ వాడిదే. తొందరపడి చేసినందుకు మనమే అనుభవిస్తాం. కులపెద్ద వెలివేస్తాడు. చచ్చేమన్న మాటే. అంచేత దేని దోవ దానిది. ఆలోచనకీ, ఆచారానికీ సంబంధం లేదు."

"అంతే?" అని అణుచుకున్న ఆశ్చర్యంతోటీ, కోపంతోటీ అన్నాడు ఎరుకయ్య.

"సందేహం లేకుండా!"

"ఇన్ని తెలిసిన వాడివి నువ్వు ఇలాగ చేస్తావనుకోలేదు" అన్నాడు శాంతం తెచ్చుకుని ఎరుకయ్య.

"తెలిస్తే మట్టుకు చేస్తానని నిర్ణయమేముంది? వెనక మనలాంటి వాళ్ళు ఎంతమంది మనలాగ అనుకొని ఉండరు! వాళ్లంతా చేశారా ఏమిటి"

"మంచి పని చెయ్యడానికి స్వతంత్రం లేదంటావు?"

"సంప్రదాయం కంటే సాధ్యమైనదేదీ లేదు."

"నీ మనస్సులో పళ్ల పండగంటే అభిప్రాయమేమిటి?"

వెనకే చెప్పాను. మళ్ళీ ఎన్నిసార్లు చెప్పిస్తావు?"

కొండయ్య అభిప్రాయం మారనందుకు ఎరుకయ్య సంతోషించాడు. "అనుకున్నది చెయ్యడానికి ధైర్యం లేదు మనకి" అని పైకి అన్నాడు.

"చేస్తే అందరం చెయ్యాలి. లేకపోతే అందరం మానెయ్యాలి."

"అందరం ఎలా చేస్తాం? ఆలోచించమంటే ఆలోచించని వాళ్ళు ఎంతమంది లేరు? ఔనంటావా?"

"నిజమే"

"మరి అందరూ ఎలాగ చేస్తారు ఒక్కమాటు?"

"నిజమేనయ్యా! నేనా విషయమై ఏమీ చెప్పలేను గానీ నేను మట్టుకు చేసేదేమిటో చెప్పాను."

"అది రావలసిన మార్పే అంటావు."

"అక్షరాలా. అయితే నేను మట్టుకు చెయ్యలేను."

కొండయ్య అభిప్రాయానికి ఎరుకయ్య సంతోషించాడు. ఎరుకయ్య రహస్యంగా ఒక విషయం చెప్పాడు: "అబ్బాయి! నువ్వు చేసినా చెయ్యకపోయినా న్యాయమని తోచిన నీ అభిప్రాయాన్ని మట్టుకు వ్యాపింపచెయ్యి."

"అవశ్యం" అన్నాడు కొండయ్య.

ఒకరోజున ఎరుకయ్య కోనయ్య దగ్గరకి వెళ్ళాడు. వెనక అతనితో పళ్ల పండగ విషయం ముచ్చటించి అతని అభిప్రాయం తెలుసుకున్నాడు. "కోనయ్యా! మీ అమ్మాయి మద్రయ్యగారి నానయ్యని పెళ్ళాడతానంటూందట?" అన్నాడు.

"ఔను. తొందరలోనే శుభకార్యం జరుగుతుంది."

"పళ్ల పండగ జరగదన్న మాటేనా?"

"ఎవరన్నారు?"

ఎరుకయ్య నిర్ఘాంతపోయాడు. కోనయ్య తన అభిప్రాయం అప్పుడలా వెలిబుచ్చి ఇప్పుడిలాగ మాట్లాడడం ఎరుకయ్యకి ఆశ్చర్యం వేసింది. "అది కాదు కోనయ్యా! మీ అమ్మాయికి పళ్ల పండగ చెయ్యవు కదా అంటున్నా" అన్నాడు.

"అదే, ఎవరన్నారని అలాగంటున్నావు?"

"నువ్వు మరి అప్పుడు అది మంచి ఆచారం కాదన్నావు కాదూ?"

"అప్పుడు తెలివితక్కువగా అన్నాను. అంతకంటె మంచి ఆచారం లేదని ఆ ఉత్తర క్షణమే అనిపించింది. మరొక క్షణం నువ్వు ఉండే వుంటే నీతో అప్పుడే చెప్పేవాణ్ని అది గొప్ప ఆచారమని."

ఎరుకయ్య జాగ్రదవస్థని నమ్మలేకుండా ఉన్నాడు. "ఆచారానికి ఎదురు వెళ్ళలేక కోనయ్య ఆ పళ్ల పండగని గొప్పదని కూడా పొగుడుతున్నాడు." అని మనస్సులో అనుకున్నాడు, పైకి "నువ్వు ఎలాగ చేస్తే చేశావు. కాని పళ్ల పండగని గురించి నీకు మనస్సులో ఉన్న అభిప్రాయం చెప్పు" అని విస్పష్టంగా అన్నాడు.

"నేనిప్పుడు చెప్పేది నా అభిప్రాయమే. నాకు మరొక అభిప్రాయం లేదు."

కోనయ్య మాటలు అబద్ధమని ఎరుకయ్య "నువ్వు నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యి గాని నీ అంతరాత్మ అనే మాటలేమిటి?" అన్నాడు.

"నా అంతరాత్మ అనేదా, అందరూ ఎలాగ చేస్తే అలాగ చెయ్యమని. అంతేగాని మరొక దోవకి వెళ్ళకు అని."

కోనయ్య మనస్సు ఎరుకయ్యకి బోధపడింది. అతనితో వాదించి లాభం లేదనుకొన్నాడు. "అయితే మరి వెళతాను. ఇంకా ఆలోచించు. తొందరపడవద్దు. మన పక్షం వాళ్ళం చాలామంది ఉన్నాం. ఒంటరిగాణ్ణయిపోతానని నువ్వు భయపడనక్కర్లేదు" అని ధైర్యం చెప్తున్నట్టు పలికాడు. కాని కోనయ్యకి వేరే ఆలోచన లేదు. ఎరుకయ్య లేచి వెళ్ళిపోయాడు.

ఎరుకయ్య, అతని బృందం గూడెంలో అనేక మందికి తమ ఉద్దేశాల్ని వ్యాపింపజేశారు. మనస్సులోంచీ ఒప్పుకున్న వాళ్ళు కొందరు, ఎరుకయ్య పలుకుబడికి హడిలి ఔనన్న వాళ్ళు కొందరు, లోపల మంచిదనుకొని పైకి ఆ మాట అనడానికి భయపడేవాళ్ళు కొందరు, సంప్రదాయం కంటే మెరుగైనది లేదనే వాళ్ళు కొందరు, ఏ పద్ధతైతే మనకేమిటి, ఇలాగ జరిగిపోనిద్దురూ అని తలంచేవాళ్ళు కొందరు- ఇలాగ నానా విధాలుగా ఉన్నారు.

ఎరుకయ్య సంస్కరణోద్దేశం కులపెద్ద జాలయ్య నోటీసులోకి వెళ్ళింది. జాలయ్య మండిపడ్డాడు. గూడెంలో ముఖ్యుల్ని కొందరిని రప్పించాడు. ఎరుకయ్య వ్యవహారం చెప్పి అతనికి శిక్ష విధించవలసిందనీ, ఆ నేరానికి అతన్ని చెట్టుకి తలకిందులుగా కట్టి వారం రోజులుంచాలనీ చెప్పి, ఎరుకయ్యని తన దర్శనానికి రమ్మని కబురు పంపించాడు.

ఎరుకయ్యకి అన్ని విషయాలు తెలిశాయి. అతను జాలయ్య దర్శనం తొందరలోనే చేస్తానని వర్తమానం పంపాడు. ఎరుకయ్యకి జరగబోతూన్న ఆపద విని అతని అనుచరులు అతని దగ్గరకు

పెళ్లంటే...

మూడు ముళ్లు
ఆరు అడుగులు కానేకాదు-
మూడు నవ్వులు
ఆరు అలకలు అంతకన్నా కాదు-
ఏడు జన్మల బంధం.
అటు ఏడు తరాలు- ఇటు
ఏడు తరాలు కలిసి
ఆకాశ హర్మ్యాల
ఆనందంగా విహరించే
సుమధుర సన్నివేశం-
పెళ్లంటే-
ఆమెకు అతను
అతనికి ఆమె
మమైకమయ్యే మంగళకర లీల-
తుది అన్నది ఎరుగని
సంసారపు జీవనహేల!

-కోలపల్లి

వచ్చారు. ప్రాగ్నాంతరం తెలియజేయవలసిందన్నారు. జాలయ్య మీదికి యుద్ధానికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పి, పొదులలోంచి బాణాలు తీసి విల్లులెక్కుపెట్టి, అతని ఆజ్ఞ కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఎరుకయ్య సంతోషించాడు. తొందరలోనే తన ఉద్దేశం తెలియజేస్తానని చెప్పాడు. ఆలోచనపరుల్ని పన్నెండు మందిని ఎంచి ఎరుకయ్య వారితో మంత్రాంగం జరిపాడు. యుద్ధం ప్రకటించవలసిందే అని వారు ఆలోచన చెప్పారు. కాని ఎరుకయ్య "మనం రహస్యంగా ఒక పని చెయ్యాలి. అది రెండో వాడికి మీవల్ల తెలియగూడదు. జాలయ్య యుద్ధానికి సిద్ధపడి వుంటాడు. కాని మరొక రకమైన అపకారం జరుగుతుందని తలచి ఉండడు. మీరు రహస్యంగా అతన్ని బందీచేసి దూరంగా ఏ అడవుల్లోనో, కొండల్లోనో దాచెయ్యాలి. జాతికి అధికారిని నేనవుతాను. జాతికి మంచి అని తోచిన ఆజ్ఞలు అమలులో పెడదాము" అని గంభీరంగా చెప్పాడు. ఎరుకయ్య బుద్ధి విశేషానికి మంత్రులు ఆశ్చర్యపోయారు.

✤✤✤

జాలయ్య ఏమయిందీ ఎవరికీ తెలియదు. గూడెమంతా అట్టుడికినట్టు ఉడికిపోతోంది. జాలయ్య న్యాయంగా ఉండనందుకు దేవతలు అతన్ని నాశనం చేశాయని కొందరూ, న్యాయంగా ఉండినందువల్ల దేవతలలో కలిసిపోయాడని కొందరూ, ఎరుకయ్య తన అనుచరులచేత చంపించాడని కొందరూ- అందరూ తలోవిధంగా చెప్పుకుంటున్నారు.

ఎరుకయ్య గూడేనికి రాజయ్యాడు. ఉత్తర క్షణంలోనే పళ్ల పండగ ఉండకూడదని శాసించి, ఉల్లంఘించిన వారిని చెట్టుకి తలకిందుగా నాలుగు రోజులపాటు వేళ్ళాడకడతానని గూడెమంతా చాటింపించాడు. కొందరు ఏమయినాసరే పళ్లపండగ చేస్తామన్నారు. మరికొందరు అధికారి ఆజ్ఞ మీరమన్నారు. కొందరు తాము కోరుకుంటున్న మార్పు వచ్చిందన్నారు. ఇంకా కొందరు భూలోకం నాశనమయిపోడానికే ఈ ఆజ్ఞ వచ్చిందన్నారు.

కొండయ్య తన కూతుళ్లకి పళ్లపండగ చెయ్యడానికి పూనుకున్నాడు. ఎరుకయ్య భటులు వచ్చి కొండయ్య రెక్కవిరిచి కట్టి తీసుకువెళ్ళి చెట్టుకి తలకిందులుగా కట్టారు. తనని రక్షించవలసిందనీ, తప్పు చేసినందుకు క్షమించ కోరుతున్నానని కొండయ్య బతిమాలుకున్నాడు. కొండయ్య యొక్క వెనుకటి పరిచయం ఆలోచించి ఎరుకయ్య క్షమించాడు. కొండయ్య తాను బతికి ఇవతలపడడం రెండో జన్మగా భావించాడు.

ఎరుకయ్య తన దగ్గరికి రావలసిందని ప్రత్యేకంగా కోనయ్యకు కబురు పంపించాడు. అతను రాగానే అతని కూతురు విషయమై అడిగాడు. కోనయ్య తాను సంప్రదాయం తప్పితేనే తనకి భయం కాని మరి దేనికీ భయం లేదని నిర్భయంగా చెప్పాడు. ఎరుకయ్య భటులకి ఆజ్ఞ ఇచ్చాడు. కోనయ్యని చెట్టుకి వేళ్ళాడగట్టారు. ఒక్క పూటలోనే కోనయ్య తన నిర్ణయం మార్చుకొని శిక్ష నుంచి విడుదల పొందాడు.

ఊళ్ళో ఇద్దరు ఆసాములు పళ్ల పండగ ఆజ్ఞని ఉల్లంఘించారు. ఉత్తర క్షణంలో వాళ్ళిద్దరినీ చెట్లకి వేళ్ళాడగట్టారు. ఇద్దరూ మరణించారు. ఈ కృత్యంతో ఊళ్ళో గుసగుసలు బయలుదేరాయి. కాని బహిరంగంగా అభిప్రాయం చెప్పిన వారుకాని ఆజ్ఞని తప్పినవారు గాని లేరు. ఎరుకయ్య పలుకుబడి విస్తరిస్తూంది. ఇంక జాలయ్య తిరిగి గూడేనికి వచ్చినా ఏమీ ఫర్వాలేదనే ధైర్యం ఎరుకయ్యకి కలిగింది. అతను జాలయ్యని రహస్య ప్రదేశం నుంచి తెప్పించాడు. జాలయ్య తన పక్షం వారు లేరనీ, తను ఎదురు తిరగడం వల్ల మరణించడమే గాని మరొక లాభం లేదని తలచి అందరితో పాటే ఉండడం మొదలెట్టాడు.

నాలుగేళ్ళయింది. ఆడవారి నవ్వులలో ఉండే అందాన్ని గురించి కవీశ్వరులు రకరకాల కవిత్వం చెబుతున్నారు. చంద్రుడిలో ఉండే నలుపు ఎప్పటికైనా కన్నెనవ్వుల తళుకుల వల్లే పోవాలి గాని మరొక మార్గం లేదని వారిలో గొప్ప కవీశ్వరుల అభిప్రాయం. ■